TGTEL/25/A0827

# ప్రజా దివాన్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 228 | సోమవారం 10-08-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-



# మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

కామన్‌వెల్త్ క్రీడాకారులకు ప్రధాని మోడీ అభినందనలు

:దేశ కీర్తిపతాకను అంతర్జాతీయ స్థాయిలో నిలిపిన క్రీడాకారులను ప్రధాని మోడీ అభినందించారు. మీ గెలుపు...మీకే కాదు..దేశానికి గర్వకారణమని వారిని ప్రశంసించారు. భారత బాక్సర్ లవ్లీనాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. కామన్వెల్త్ గేమ్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలిసిన సంగతి తెలిసిందే. వారితో సరదాగా మాట్లాడిన మోదీ అథ్లెట్లకు లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా బాక్సర్ లవ్లీనా.. గ్లాస్గోలో చేసిన పనిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ఆ రెస్టరెంట్‌లో ఏం జరిగిందని మో ప్రశ్నించగా...అదేమీ చిన్న విషయం కాదని.. దేశమంతా సుదీర్ఘకాలం గుర్తు పెట్టుకుంటుందని లవ్లీనా తెలిపారు. కామన్వెల్త్ గేమ్స్‌లో మంచి ప్రదర్శన చేశాం. అది చివరి రోజు. చాలా సంతోషంగా గడపాల్సిన సందర్భం. అందుకోసం ఓ రెస్టరంట్‌కు వెళ్లాం. అయితే, మన మ్యాప్ సరిగా లేదని అనిపించింది. ఇదే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లా. మార్పులు చేస్తామని చెప్పారు. సంబరాలు చేసుకుంటున్న సమయంలో మీరు మ్యాప్ ప్రాముఖ్యతను గుర్తించడం నిజంగా అభినందనీయం అని మోడీ అన్నారు.. ఆ వీడియో సాధారణమైంది కాదు. దేశ ప్రజలు సుదీర్ఘకాలం గుర్తుంచుకుంటారన్నారు. అసలేం జరిగిందంటే...గ్లాస్గోలోని ఓ రెస్టరెంట్‌కు లవ్లీనా తోపాటు కొందరు భారత అథ్లెట్లు డిన్నర్‌కు వెళ్లారు. అక్కడ ఉన్న హ్యాండ్ టవల్స్ పై భారత్ మ్యాప్ అసంపూర్తిగా ఉండటం లవ్లీనా గమనించింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్ పూర్తి భూభాగాలను ఆ చిత్రపటంలో చూపించకపోవడంతో సోషల్ మీడియా వేదికగా లవ్లీనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ తర్వాత రెస్టరంట్ క్షమాపణలు చెబుతూ ఓ ప్రకటనను జారీ చేసింది.

## హర్ ఘర్ తిరంగాలో ఉత్సాహంగా పాల్గొనాలి

ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు



మన జాతీయ పతాకం దేశానికి గర్వకారణమని, 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని అన్నారు. త్రివర్ణ పతాకం మనకు నిరంతర ప్రేరణ శక్తి అని పేర్కొన్నారు.

## గ్లోబల్ పర్యాటక పటంలో ఆంధ్రప్రదేశ్

గోదావరి పుష్కరాలు-2027 కు అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం




- ఏపీ పర్యాటక రంగ అభివృద్ధికి గ్లోబల్ టూర్ ఆపరేటర్లు భాగస్వాములు కావాలని మంత్రి దుర్గేష్ పిలుపు
- ఏపీలో పర్యాటక అవకాశాలపై ఐఏటీఓ సమావేశంలో ప్రత్యేక చర్చ
- పుష్కరాల నాటికి ఆధ్యాత్మిక సర్క్యూట్లు, పంచారామ క్షేత్రాల దర్శనం,
- సెప్టెంబరు 10 నుండి 13 వరకు విశాఖపట్నంలో ఐఏటీఓ వార్షిక సదస్సు

2లో

## సాగర్‌లో ముగిసిన వరుణయాగం

### పూర్ణాహుతిలో పాల్గొన్న రేవంత్ దంపతులు

వేకువజామునే క్రతువు ప్రారంభించిన ఉత్తమ్ దంపతులు



రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి జలాశయాలు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం నాగార్జునసాగర్ వేదికగా 'మహా వరుణ యాగం' నిర్వహించింది. నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ విశిష్ట ఆధ్యాత్మిక క్రతువును చేపట్టారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అర్చకులు , వేదపండితుల ఆధ్వర్యంలో 108 మంది రుత్వికులు 11 హోమగుండాలతో ఈ మహా యాగాన్ని శాస్త్రోక్తంగా పూజలు జరిపి పూర్తి చేశారు. ఈ వరుణ యాగంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులు పాల్గొని హోమగుండంలో పూర్ణాహుతి సామాగ్రిని సమర్పించారు. కృష్ణా, గోదావరి నదులు జలకళను సంతరించుకోవాలని, రాష్ట్రంలోని చెరువులు , రిజర్వాయర్లు నిండి పంటలు సమృద్ధిగా పండాలని సీఎం దంపతులు వరుణ దేవుడిని ప్రార్థించారు. ఈ క్రతువులో పలువురు ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొనగా, శాస్త్రోక్తంగా నిర్వహించిన మహాపూర్ణాహుతితో ఈ వరుణ యాగం ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి రాష్ట్రం పాడిపంటలతో విలసిల్లాలని కాంక్షిస్తూ.. ప్రభుత్వం వరుణయాగం నిర్వహిస్తోంది. సోమవారం తెల్లవారుజామున ఆదిపూజ నిర్వహించి యాగ క్రతువును ప్రారంభించారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దంపతులు ఈ యాగంలో పాల్గొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, మాజీమంత్రి జానారెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు యాగ క్రతువులో పాల్గొన్నారు.

## వరంగల్‌లో ఉద్యమాన్ని 'పెద్ది' ఒంటిచేత్తో నడిపించారు: కేటీఆర్

నర్సంపేట: ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు.

2లో



## ఫార్చ్యూన్ ఇండియాలో లోకేశ్‌పై కథనం

కోటి కర్చు చేశారన్న ప్రచారం ఖండించిన ప్రభుత్వం




2లో

- ఫార్చ్యూన్ ఇండియా పత్రికలో మంత్రి నారా లోకేశ్‌పై వ్యాసం కోసం కోటి

రూపాయలకుపైగా ప్రభుత్వ ధనం ఖర్చు చేశారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## స్మార్ట్ రేషన్ కార్డులు విప్లవాత్మక నిర్ణయం



2లో

## గోవింద నామాలతో వైకాపా పేరడీ..

### పవన్ ఆగ్రహం

- పవిత్ర గోవింద నామాలపై వైకాపా పేరడీ
- వైకాపా నేతల తీరుపై పవన్ ఆగ్రహం
- భక్తుల మనోభావాలను కించపరిచారంటూ మండిపాటు
- ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించే చర్యలని వ్యాఖ్య
- చట్టప్రకారం ముందుకెళ్లాలని పార్టీ నేతలకు సూచన
- దైవ నామాలు, కీర్తనలను అపహాస్యం చేయొద్దని హితవు



అమరావతి: తిరుమల శ్రీవారిని భక్తితో కొలుస్తూ ఆలపించే పవిత్ర దైవ నామాలు, భక్తి గీతాలను వైకాపా నేతలు పేరడీలుగా పాడటాన్ని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఖండించారు. నెల్లూరులో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వైకాపా నేతలు వ్యవహరించిన తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జనసేన పార్టీ 'ఎక్స్'లో వెల్లడించింది. దీనిపై చట్టప్రకారం ముందుకెళ్లాలని పార్టీ నేతలకు పవన్ దిశానిర్దేశం చేసినట్లు పేర్కొంది. "ప్రతిపక్ష హోదా కూడా లేని పార్టీ.. రాజకీయాల కోసం పవిత్ర గోవింద నామాలను పేరడీగా చేస్తూ భక్తుల మనోభావాలను కించపరిచింది. ఆ కార్యక్రమంలో పాల్గొన్నవారు వ్యవహరించిన తీరు ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉంది. మత విద్వేషాలు రేపే కుట్రపూరిత ఆలోచనలతో చేసిన ఈ చర్యలపై పార్టీ నేతలు చట్ట ప్రకారం

## ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు

### ఎక్కడా కార్యాలయ భవనాల నిర్మాణమేదీ

- భూభారతితో రైతులకు భరోసా కల్పించిన ప్రజాప్రభుత్వం
- గత బిఆర్ఎస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ పొంగులేటి
- హుస్నాబాద్ నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు ప్రారంభం



రాష్ట్రవ్యాప్తంగా గత పాలకులు ఆర్భాటంగా అనేక డివిజన్లు, జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేశారని.. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. అయితే వాటికి ఎక్కడ కూడా ఆఫీసులు, ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.600 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 180 రెవెన్యూ తహశీల్దార్ కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాలను యుద్ధ ప్రాతిపదికన సంవత్సరంలోపు పూర్తి చేశామని తెలిపారు.

జిల్లాలోని ఎల్కతుర్తిలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ధరణిని బంగాళాఖాతంలో వేశామని.. భూభారతి చేపట్టి రైతులకు పూర్తి భద్రత, భరోసా ఇచ్చేలా భూములను ప్రక్షాళన చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ప్రతి రెవెన్యూ విలేజ్‌లోని ప్రతి అంగుళాన్ని సర్వే చేసి మనిషికి ఎలాగైతే ఆధార్ ఉందో, భూములకు కూడా భూధార్ ఇస్తామని చెప్పారు. రైతులందరి సహకారంతో భూముల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఒక భద్రత, భరోసా కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

రైతన్నల దీవెనలతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అన్నదాతను రాజు చేయడమే తమ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గడిచిన రెండున్నరేండ్లలో వేల కోట్లు రైతన్నల కోసం ఖర్చు చేశామని, కనీవినీ ఎరగని విధంగా

2లో

TGTEL/25/A0827
ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక
10-08-2026

# సంపాదకీయం

## లిఖిత రూపాల నిరంకుశత్వం

మన దేశంలో – సహజంగానే – కులవ్యవస్థ వ్యాప్తికీ, కొనసాగింపుకీ లిఖిత సంప్రదాయం ఉపకరించింది. 'విధిరాత'కి సర్వత్రా విధేయత లభించింది. అర్థం కానిదల్లా 'బ్రహ్మలిపి' అయింది. అయితే ఇది కొద్దిరోజుల్లో కొంతమంది ఒక చోట గుమిగూడి చేసిన కుట్ర కాదు; శతాబ్దాలపాటు క్రమేపీ దేశమంతటా వ్యాపించిన భావజాలం.

మాట్లాడే జంతువు మనిషి మాత్రమే. సుమారు లక్ష సంవత్సరాల క్రిందట భాషకు మౌలిక రూపాలు ఏర్పడ్డాయని శాస్త్రజ్ఞుల అంచనా. ఆదిమ మానవులు గుంపులుగా వేటాడేటప్పుడు, ఒకరినొకరు హెచ్చరించుకుంటూ, జంతువు జాడను తెలియపరచుకుంటూ ముందుకి సాగిన కాలంలో శబ్దాలు, అనుకరణలు, మాటలు అవసరమయ్యాయి. వేట ముగిసాక, రాత్రిపూట మంట చుట్టూ చేరి, మాంసం తింటూ, ఆ రోజున జరిగిన సాహసాల్ని పిల్లలకు వివరించినప్పుడు కథలు పుట్టి ఉండవచ్చు. మాటలు, పాటలయ్యాయి; పాటకి నృత్యం తోడైంది. సాహిత్యం, సంగీతం, భాషతోనే వికసించాయి. భాష అనే ఉమ్మడి సాధనమే మానవ సమూహాల తొలి అస్తిత్వ ప్రకటన.

లిపి తరవాతెప్పుడో (సుమారు క్రీ.పూ.3000) పుట్టింది. తిండిని పోగు చేసుకుంటూనో, వేటాడుతూనో, లేదా పశుపోషకులుగానో జీవించిన తెగలకు లిపి అవసరం లేదు. నదీ తీరాలలో స్థిర వ్యవసాయం మొదలై, పట్టణాలు వెల్లివిరిసాక -- నాగరికులకు ఎన్నో వస్తువులు, దినుసులు, వస్త్రాలు, మద్యం, వగైరాలు అవసరమ య్యాయి. అదనపు ఫలసాయం, వస్తు మార్పిడి, ఇతర ప్రాంతాలలో దొరికే వస్తువులను సంపాదించుకోవడానికి తోడ్పడ్డాయి. డబ్బు వాడుకలోకి వచ్చాక, దూర దేశాలతో వ్యాపారం సుగమం అయింది. నౌకా రవాణా వృద్ధి చెంది, రేవులు నగరాలయ్యాయి. ఈ క్రమంలోనే లిపి అవసరమైంది. సింధునదీ ప్రాంతంతో సహా అన్ని ప్రాచీన నాగరికతలలోనూ వర్తకుల ముద్రలకు, సుంకాల పట్టీలకు, పాలకుల ప్రకటనలకు లిపి ఆధారమైంది. శిలాక్షర రూపాల్లో శాసనాలు లిఖించబడ్డాయి.

తర్వాతి దశలో అంతవరకూ మౌఖికంగా ఉండిన జానపద గాథలకు లిఖిత రూపం ఇచ్చే ప్రయత్నం జరిగింది. ఆ రాతలు చిలవలు పలవలుగా విస్తరించాయి. ఒకే మూలకథ వివిధ ప్రాంతాల్లో, కాలాల్లో లిఖిత రూపాల్లోకి రూపాంతరం పొందింది. ఈ ప్రక్రియ, పండితుల పూనికతో, పాలకుల ఆధ్వర్యంలో జరిగింది. మౌఖిక రూపాలకు ఉండే స్థానికత, భిన్నత్వం, స్థలకాల విశేషాలకు అనుగుణంగా మలుచుకొనే ఒదుగుబాటు-- లిఖిత రూపాలకు లోపిస్తుంది. అవి శాశ్వత శాసనాలుగా, మార్చలేని బోధనలుగా తొందరలోనే అవతరిస్తాయి. దీన్నే ఆధునిక భాషా శాస్త్రానికి ఆద్యుడైన స్విస్ భాషాశాస్త్రవేత్త ఫెర్డినాండ్ డి సాసూర్ (1857--1913) 'లిఖిత రూపాల నిరంకుశత్వం' అన్నాడు. అతడి ప్రతిపాదనలను మన దేశానికి, మన ప్రాంతాలకు అన్వయించే ప్రయత్నం ఈ వ్యాసం.

పురాణాలు, ధర్మ సూత్రాలు, ముఖ్యంగా పవిత్ర గ్రంథాలు వెలువడ్డానికి లేఖనం గొప్ప వెసులుబాటుని కల్పించింది. స్థానిక విశ్వాసాల సముదాయాలు మతరూపంలో వ్యవస్థీకృతం అయ్యాయి. మనదేశంలో మాత్రం ఒక వైపు తెగల విశ్వాసాలు, మరో వైపు వ్యవస్థీకృత మతం చెట్టాపట్టాలు వేసుకుంటూ కొనసాగుతున్నాయి. చరిత్రకారుడు డి.డి. కోసంబి (1907--1966) చెప్పినట్లు -- కొత్తగా ప్రవేశించిన ఏ వ్యవస్థయినా పాత వ్యవస్థను పూర్తిగా తొలగించలేకపోవడం, అన్ని పురాతన పద్ధతులూ, లోలోపలి పొరలుగా కొనసాగడం, మన దేశపు ప్రత్యేకత. ఇందుకు మరో ఉదాహరణ -- వేల ఏళ్లపాటు కొనసాగిన వేదాల మౌఖిక రూపం. ఒక్క అక్షరం కూడా పొల్లు పోకుండా, ఉచ్చారణలో మార్పులు లేకుండా, ఈ పరంపర కొనసాగడం గొప్ప విశేషం. పవిత్ర బోధనలను ముఖస్థం చేయడమే సరైన పద్ధతి అని పూర్వీకుల భావన కావచ్చు; లేదా లిఖిత రూపంలో ఉంటే అవి ఎవరి చేతిలోకి వెళ్లి మైల పడతాయో అనే భయం కావచ్చు. నిష్ఠాపరులైన బ్రాహ్మణులకు తప్ప వేరెవరికీ అందుబాటులో లేని వేదాలను మినహాయిస్తే, పంచమ వేదమైన మహాభారతాన్నీ, అలాగే రామాయణ భాగవతాలనూ, పామరులకు విడమర్చి చెప్పేందుకై పండితులు అవసరం. ప్రవచనకారుల దృష్టి కథా, కథానాలకన్నా సామాన్య జనులు గ్రహించాల్సిన ధర్మ సూక్ష్మాలపైనే ఎక్కువగా ఉంటుంది. అన్ని వ్యవస్థీకృత మతాలలోనూ, పవిత్ర గ్రంథాల్లోని ఒక్క అక్షరాన్ని కూడా మార్చకూడదని సంప్రదాయవాదులు పట్టుబడతారు. ఆ విధంగా శాశ్వత ప్రాతిపదికపై సమాజాన్ని కట్టడి చేయగల సాధనాలను పాలకులు సమకూర్చుకున్నారు. ముద్రణాయంత్రం లిఖిత సంప్రదాయ సుస్థిరతకి, వ్యవస్థీకృత మతాల వ్యాప్తికి, విశేషంగా తోడ్పడింది.

మన దేశంలో -- సహజంగానే -- కులవ్యవస్థ వ్యాప్తికీ, కొనసాగింపుకీ లిఖిత సంప్రదాయం ఉపకరించింది. 'విధిరాత'కి సర్వత్రా విధేయత లభించింది. అర్థం కానిదల్లా 'బ్రహ్మలిపి' అయింది. అయితే ఇది కొద్దిరోజుల్లో కొంతమంది ఒక చోట గుమిగూడి చేసిన కుట్ర కాదు; శతాబ్దాలపాటు క్రమేపీ దేశమంతటా వ్యాపించిన భావజాలం. పాలకుల ఉనికిని కాపాడుకోవడానికీ, ప్రజల్ని నియంత్రించేందుకూ అత్యంత సామర్థ్యవంతమైన ఆలోచనా చట్రమే పాలకవర్గ భావజాలంగా పరిణమిస్తుంది. మౌఖిక భాషాభివృద్ధి దిగువనుండి, లిఖిత రూపం ఎగువనుండి -- తమ ప్రయాణాలను ఆరంభించాయి. ఈ క్రమంలో కులవ్యవస్థ కీలకమైన పాత్రను పోషించింది. నిజానికి భారతదేశంలో -- ప్రాచీన కాలంలోనైనా, ఆధునిక యుగంలోనైనా -- ఏ ఒక్క అభివృద్ధి ప్రక్రియ లేదా మార్పు కూడా కులవ్యవస్థకి బాహ్యంగా జరగలేదు. సామాజిక చలనం తీవ్రతరమైన సందర్భాలలో కూడా కులం బలహీన పడలేదు సరి కదా, కొత్త నిర్మాణాల్లోనూ విడదీయలేని భాగం అవుతూ వచ్చింది.

అత్యధిక సంఖ్యలో వినియోగదారులను చేరుకొనేందుకై సినిమా, టీవీ, ప్రింటు మీడియాలకు ప్రామాణిక భాష అవసరం అవుతుంది. సహజంగానే, అది ఆధిపత్య ప్రాంతాల మాండలికం అవుతుంది. ఆర్థికాభివృద్ధిలో, నదీజలాలతో సహా అన్ని సహజవనరుల అందుబాటులో తేడాల మూలంగా ఏర్పడే అసమానతలు, అంతర్గత దోపిడీ, ఉప--వలసీకరణలకి దారి తీస్తాయి. ప్రాంతీయ అస్తిత్వ ప్రకటనల్లో పైకి స్పష్టంగా కనిపించేది మాండలికం అని పిలువబడే భాష; ఆ వెనుకనే ఉండేవి చరిత్ర, సంస్కృతి. ఆర్థిక వెనుకబాటుతనం. తీవ్రమైన అసంతృప్తి, అస్తిత్వ చైతన్యాన్ని జ్వలింపజేస్తుంది; వేర్పాటువాద ఉద్యమాలు మొదలవుతాయి. అందుచేత మాండలిక భిన్నత్వం వెనుక పెద్ద కథే దాగి ఉంటుంది.

అదృష్టవశాత్తూ, ఈ నాణేనికి రెండవ పార్శ్వం కూడా ఉంది. ఇటీవలి కాలంలో, ఇంతవరకూ చదువుకి దూరంగా ఉంచబడిన సమూహాల చేతుల్లో అక్షరం ఆయుధంగా మారింది. స్వీయ అనుభవాల ప్రకటన లిఖిత రూపాల్లో ప్రాచుర్యం పొందుతోంది. ఇది ప్రజాస్వామ్యీకరణ వైపుగా మొదటి అడుగు. అక్షరాస్యత అందుబాటులోకి వచ్చాక, వారి కోసం ఎవరో కలం పట్టే అవసరం లేకుండా పీడిత సమూహాల సభ్యులే స్వయంగా రచనలు చేసే స్థాయికి ఒక్క తరంలోనే చేరుకున్నారు. నిజానికి అక్షర ప్రపంచంలోకి దూసుకొచ్చారు. ఈ రాక వెనుక గ్రామీణ పాఠశాలల్లో నిబద్ధతతో పని చేస్తూన్న ఉపాధ్యాయుల అదృశ్య పాత్ర చెప్పుకోతగ్గది. దీనికొక నేపథ్యం ఉన్నది.

సామ్రాజ్యవాద వ్యతిరేకత పెల్లుబికిన కాలంలో విద్యావంతులైన మధ్యతరగతి, అగ్రవర్ణ సమూహాలలో దేశ విముక్తి కోసమై ఆకాంక్ష బలపడింది. దానికి అనుబంధంగా సమానత్వం, సామ్యవాదం, ఆదర్శాలుగా నిలిచాయి. ఆ దశలోనే భారత రాజ్యాంగ నిర్మాణానికి బీజాలు పడ్డాయి. అభ్యుదయవాద లిఖిత సాహిత్యం ఉవ్వెత్తున ఎగసిపడి, పీడిత జనులకు దగ్గరయ్యే ప్రయత్నాలను ఉద్యమరూపాల్లో తీవ్రతరం చేసింది. ప్రజాహితంగా నడిచే ఏ ఉద్యమమైనా చైతన్యాన్ని రగిలిస్తుంది. అది ఎక్కడో, ఎప్పుడో, ఎవరో ఒకర్ని తాకుతుంది. ప్రజా కళారూపాలకు అభ్యుదయ, విప్లవోద్యమాలు సముచిత స్థానం కల్పించాయి. బాధితులు తమ స్వరాన్ని వినిపింపజేయడం మొదలైనప్పుడు, ఆత్మకథలు, లిఖిత ప్రపంచానికి తెలియని జీవిత వృత్తాంతాలు, వెలువడడం సహజం. ఆ రచనలన్నీ ప్రధానంగా మాండలికాల్లో, యాసతో ఉంటాయి. వాటి నూతనత్వం, అప్పటికే వేళ్లూని ఉన్న లిఖిత వ్యవస్థల దృష్టిని ఆకర్షిస్తుంది.

## గ్లోబల్ పర్యాటక పటంలో ఆంధ్రప్రదేశ్

మొదటిపేజీ తరువాయి

దేశంలోనే అత్యంత వైవిధ్యమైన పర్యాటక ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ ఒకటిగా నిలుస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు, రాష్ట్రాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ టూర్ ఆపరేటర్స్(ఐఏటీవో), ట్రావెల్ ట్రేడ్ భాగస్వాములు, హోటల్ రంగానికి చెందిన ప్రముఖులతో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సోమవారం న్యూఢిల్లీలోని తాజ్ అంబాసిడర్ హోటల్ లో ఒక ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..రాష్ట్రంలో అపారమైన పర్యాటక అవకాశాలు ఉన్నాయని, అధ్యాత్మిక, సాంస్కృతిక, చారిత్రక, తీరప్రాంత, ప్రకృతి, వెల్నెస్, క్రూయిజ్ టూరిజం విరాజిల్లుతోందన్నారు. కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధిని వివరిస్తూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పెట్టుబడిదారుల అనుకూల పర్యాటక విధానాలు, మెరుగైన రవాణా వసతులను ఉపయోగించుకొని రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల సంఖ్య, వారి బస సమయం మరియు ఖర్చును పెంచేలా వినూత్న టూర్ ప్లాన్లు, డెస్టినేషన్ ఆధారిత, అనుభవపూర్వక, సర్క్యూట్ ఆధారిత పర్యాటక అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దేశ విదేశీ టూర్ ఆపరేటర్లను మంత్రి దుర్గేష్ ఆహ్వానించారు. ట్రావెల్ రంగానికి చెందిన భాగస్వాములతో బలమైన సంబంధాలు అవసరమని పేర్కొన్నారు. డెస్టినేషన్ ఫెమిలియరైజేషన్ విజిట్లు, ప్రచార మద్దతు, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మరియు ఇతర భాగస్వాముల సదుపాయాల కల్పన ద్వారా టూర్ ఆపరేటర్లకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ భేటీలో ప్రత్యేకించి 2027 జూన్ 26 నుండి జూలై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలు గురించి సుదీర్ఘంగా చర్చించారు. ప్రతి 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ ఉత్సవాన్ని కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమంగానే కాకుండా గోదావరి తీరప్రాంత సంస్కృతి, సంప్రదాయాలు, హస్తకళలు, ఆహార సంస్కృతిని ప్రతిబింబించేలా నిర్వహించనున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలోని ఆరు జిల్లాల్లో ఉన్న వందలాది ఘాట్లలో నిర్వహించే ఈ పుష్కరాలు పర్యాటక మరియు హోటల్ రంగ వ్యాపారాలకు సరికొత్త అవకాశాలను తెచ్చిపెడతాయని పేర్కొన్నారు.గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని ఆధ్యాత్మిక సర్క్యూట్లు, పంచారామ క్షేత్రాల దర్శనం, రివర్ క్రూయిజ్ అనుభవాలు, విలేజ్ అండ్ నేచర్ టూరిజం,జిఐ ఉత్పత్తుల పర్యటనలు, గ్రామీణ, ప్రకృతి ఆధారిత పర్యాటకం వంటి ప్రత్యేక ప్యాకేజీలను రూపొందించాలని టూర్ ఆపరేటర్లను మంత్రి దుర్గేష్ కోరారు. పుష్కరాల కోసం ఘాట్ల అభివృద్ధి, వసతి సౌకర్యాల పెంపు, రివర్ ఫ్రంట్ అందాలను తీర్చిదిద్దడం, డిజిటల్ సేవలు, మౌలిక వసతుల కల్పన, సమగ్ర ప్రచార కార్యక్రమాలు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు.ట్రావెల్ ట్రేడ్‌తో సుదీర్ఘకాల భాగస్వామ్యాన్ని నిర్మించుకోవడానికి ఏపీ పర్యాటక శాఖ కట్టుబడి ఉందని మంత్రి దుర్గేష్ పునరుద్ఘాటించారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులకు ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా పరిచయం చేసేందుకు ఐఏటీఓ సభ్యులు కలసిరావాలని కోరారు. టూర్ ఆపరేటర్లు, ఇతర భాగస్వాముల మద్దతుతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, గోదావరి పుష్కరాలు 2027ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఒక చారిత్రక పర్యాటక, సాంస్కృతిక ఉత్సవంగా తీర్చిదిద్దగలమని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. ట్రావెల్ రంగానికి చేరువయ్యే కార్యక్రమంలో భాగంగా ఏపీ పర్యాటక శాఖ, ఐఏటీవో సంయుక్తంగా 2026 సెప్టెంబరు 10 నుండి 13 వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తోన్న ఐఏటీఓ (ఎయా) వార్షిక సదస్సుకు రావాలని మంత్రి దుర్గేష్ టూర్ ఆపరేటర్లకు ఆహ్వానం పలికారు.. ఈ సదస్సు ద్వారా దేశ విదేశాల నుండి వచ్చే పర్యాటక నిపుణులు ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక అవకాశాలను ప్రత్యక్షంగా పరిశీలించి, భాగస్వామ్య ఒప్పందాలు చేసుకునేందుకు మంచి వేదిక లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటకరంగ అభివృద్ధికి ప్రైవేట్ భాగస్వాములు మరియు టూర్ ఆపరేటర్లకు కూటమి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం, ప్రచార మద్దతు అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. అనంతరం పాత్రికేయులతో జరిగిన సమావేశంలో ఏపీ పర్యాటక రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, పర్యాటక రంగంలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులకు సంబంధించిన పలు ప్రశ్నలకు మంత్రి దుర్గేష్ వివరణాత్మక సమాధానాలు ఇచ్చారు.ఈ సమావేశంలో ఐఏటీవో ప్రతినిధులు రవి గోసేన్, రాజ్ నిష్ క్రైస్తా, రాజీవ్ మెహ్రా, సంజయ్ రజ్దన్, సునీల్ మిత్రా, దీపక్ భట్నాగర్ తదితరులు పాల్గొన్నారు

## వరంగల్‌లో ఉద్యమాన్ని 'పెద్ది' ఒంటిచేత్తో నడిపించారు: కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

"తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్ (నేటి బీఆర్‌ఎస్) ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్‌ఎస్ పార్టీ తీసుకుంటుంది"అని కేటీఆర్ అన్నారు.

## నగరంలో వాహనాల వీరంగం

### రెండు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

### రాంగ్‌రూట్‌లో వచ్చి ఆర్మీ జవాన్‌ను బలితీసుకున్న థార్

హైదరాబాద్ నగరంలో రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఓ మిలిటరీ జవాన్‌తో పాటు మరొకరు మృతి చెందారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందారు. కొండాపూర్ ఆర్టీఓ ఆఫీస్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన థార్ వాహనం.. ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బైక్ వెనుక కూర్చున్న వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు వనపర్తి జిల్లాకు చెందిన చెల్లా శ్రీనివాసులు (50) గా గుర్తించారు. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందగానే ఘటనాస్థలికి మాదాపూర్ పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. శ్రీనివాసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి పోలీసులు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదర్‌షాకోట్ ప్రాంతంలో వేగంగా దూసుకొచ్చిన మహీంద్రా థార్ కారు బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఓ ఆర్మీ జవాన్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల సమాచారం ప్రకారం.. మహీంద్రా థార్ కారు రాంగ్ రూట్‌లో అత్యంత వేగంగా వచ్చి ముందుగా ఓ ఆర్మీ జవాన్‌ను ఢీకొట్టింది. అనంతరం అక్కడి నుంచి ఆగకుండా వెళ్లిపోయిన కారు మరికొందరిని కూడా ఢీకొట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఆర్మీ జవాన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన కారులో ఐదుగురు యువకులు ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. వారు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అతివేగంతో పాటు రాంగ్ రూట్‌లో అడ్డగోలుగా కారు నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కారణమైన కారు శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతానికి చెందిన బాబు గౌడ్ కి చెందినదిగా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే నార్సింగ్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు. కారు డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న యువకుల వివరాలను పోలీసులు ఆరా తీస్తున్నారు. జవాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హాస్టల్‌లో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి

### కామారెడ్డికి చెందిన విద్యార్థి పరిస్థితి విషమం

మేడ్చల్‌లోని శ్రీ చైతన్య పాఠశాలకు సంబంధించిన హాస్టల్‌లో దారుణం ఘటన వెలుగులోకి వచ్చింది. పదోతరగతి విద్యార్థిపై సహచర విద్యార్థులు దాడికి పాల్పడారు. కామారెడ్డికి చెందిన విద్యార్థి అభిషేక్ రెడ్డిపై 8 నుంచి 10 మంది దాడి చేసినట్లు సమాచారం.

## మన కీర్తిపతాకను రెపరెపలాడించారు

మొదటిపేజీ తరువాయి

అయితే, ఇది కావాలనే చేసిందని.. పొరపాటు కాదని అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ గతంలో తనకు పాక్ బాక్సర్‌తో ఎదురైన అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. 'పాకిస్థాన్ గురించి ఏ మాట్లాడినా నాకొక స్టోరీ గుర్తుకొస్తుంది సర్. అది 2015 మిలిటరీ గేమ్స్. నా ఫస్ట్ ఫైట్ పాకిస్థాన్ బాక్సర్‌తోనే. అప్పుడు ఉన్నతాధికారులు, సహచరులు ఒకటే చెప్పేవారు. పాక్ బాక్సర్ చేతిలో మాత్రం ఓడిపోవద్దని అనేవారు. ఆ మ్యాచ్‌లో వరుసగా రెండు రౌండ్లలో నేనే గెలిచా. మీరు 2014లో ప్రధానిగా వచ్చారు. మా ఆర్మీ కోచ్ పేరు కూడా నరేందర్ రాణా. దానిని ఉద్దేశిస్తూ సదరు పాక్ బాక్సర్ 'బ్రదర్ నీతో ఓ విషయం చెప్పాలను కుంటున్నా' అని అన్నాడు. సరే చెప్పు అని బదులిచ్చా. 'నీ పేరు నరేందర్. మీ కోచ్ పేరు నరేందర్. మీ ప్రధాని నరేంద్ర. నాకు ఇప్పట్నుంచి ఈ పేరు అంటేనే ఇష్టం ఉండదు ఇక' అని అన్నాడు' అని బాక్సర్ చెప్పాడు. ఆ మాటలకు ప్రధాని మోదీ గట్టిగా నవ్వేశారు.

## హర్ ఘర్ తిరంగాలో ఉత్సాహంగా పాల్గొనాలి

మొదటిపేజీ తరువాయి

ఏటా స్వాతంత్య దినోత్సవం నాడు కోట్ల మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని 2022 నుంచి ప్రభుత్వం 'హర్ ఘర్ తిరంగా' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈసారి జాతీయ జెండాను ఎగురవేసి.. వికసిత భారత్‌కు మన ఉమ్మడి కట్టుబాటును చాటుదామని మోదీ కోరారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నవారు కనబరిచిన ధైర్యసాహసాలు భారతీయుల్లో ప్రతి ఒక్కరికీ ఎప్పటికీ గుర్తుండిపోతాయని మోదీ కొనియాడారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నేతృత్వంలో మొదలైన ఉద్యమం మన దేశ స్వాతంత్య పోరాటానికి నిర్ణయాత్మక ప్రేరణను ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. ఇదిలావుంటే తమ రాష్ట్రంలో వందేమాతర గీతాన్ని పూర్తిగా పాడబోమని కేరళ ఆరోగ్యశాఖ మంత్రి కె.మురళీధరన్, కాంగ్రెస్ ఎంపీ రాజ్‌మోహన్ ఉన్నిథాన్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే గీతంలోని మొదటి రెండు చరణాలనే పాడతామని తెలిపారు.

## ఆర్భాటంగా మండలాలు, రెవెన్యూ డివిజన్లు

మొదటిపేజీ తరువాయి

గతంలో సేకరించిన ధాన్యాన్ని స్టోర్ చేసే కెపాసిటీ లేకపోయినా.. చివరి గింజ వరకు కొంటామన్న ఇచ్చిన మాటను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని గుర్తుచేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరులో లబ్దిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రైతులకు సంకెళ్లు వేసి, వరి వేస్తే ఉరి అన్న బీఆర్‌ఎస్ నాయకులు.. నేడు ధాన్యం కొనుగోళ్లపై రాజకీయం చేస్తూ పాదయాత్రలతో తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించడం లేదని, పదే పదే ఈ మాట చెప్పడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదని.. పదేండ్లు రాష్ట్రాన్ని దోచుకున్న వారే నేడు గోబెల్స్ ప్రచారాలు చేస్తూ ఎద్దేవా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో పిల్లలకు వివాదాలు లేని ఆస్తి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్న మంత్రి..భూభారతి ద్వారా రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో భూముల రీ-సర్వే చేపడుతున్నట్లు వెల్లడించారు. మూడు, నాలుగు విడతల్లో వ్యవసాయ భూములతో పాటు మిగతా ఆస్తులను కూడా మ్యాపులతో సహా అందజేస్తామని, గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి'ని బంగాళాఖాతంలో వేస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు.ఎలాంటి స్వార్థం లేకుండా రైతుల కోసం పనిచేస్తున్నామని పేర్కొన్న ఆయన.. ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు నీరు తక్కువగా వినియోగించే పంటలనే సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఎమ్మార్వో కార్యాలయానికి శంకుస్థాపన మరియు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల నూతన భవనాన్ని మంత్రులు కలిసి ప్రారంభించడం జరిగింది. హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సహచర మంత్రులు ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పేయి,ఇతర ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డులు విప్లవాత్మక నిర్ణయం

### సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జగ్గారెడ్డి

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తోందని, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గొప్ప ముందడుగని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేక పోయారని, ఇప్పుడు కొత్త కార్డులు ఇవ్ంవడంతో పాటు, స్మార్ట్ కార్డులు కూడా ఇవ్వబోతున్నామని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించనున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం తారా డిగ్రీ కాలేజీలో

హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎం రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. సభని 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## ఫార్చ్యూన్ ఇండియాలో లోకేశ్‌పై కథనం

మొదటిపేజీ తరువాయి

లోకేశ్‌పై తప్పుడు ప్రచారాన్ని ఖండించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న జీవోకు, ఫార్చ్యూన్ ఇండియా కథనానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. 18-1-2025న జారీ చేసిన జీవో.. ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏపీ పెట్టుబడి అవకాశాల ప్రచారం కోసం ఇచ్చిందని.. ఓ ఆంగ్ల ఛానల్‌కు చెల్లింపులు చేయాలని ఇచ్చిన ప్రభుత్వ ఆదేశాలే ఆ జీఓలో ఉన్నాయని ఏపీ సర్కార్ వెల్లడించింది.

ఫార్చ్యూన్ ఇండియా, సిఎన్‌బిసి టివి రెండు వేర్వేరు సంస్థలని.. రెండింటికీ ఎలాంటి సంబంధం లేదని సర్కార్ వివరణ ఇచ్చింది. జీవోను వక్రీకరించి మంత్రి నారా లోకేశ్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. ప్రజలకు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం అందించడం నేరమని హెచ్చరించింది. తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక జారీ చేసింది. తప్పుడు పోస్టులను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్న వారిపైనా చట్టపరమైన చర్యలు తప్పవని ఏపీ ప్రభుత్వం స్పష్టీకరించింది.

# మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం సంకల్పం

- ఇళ్లులేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు
- కొనరావుపేట మండల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం
- నిమ్మపల్లి ప్రాజెక్టు, వట్టిమల్ల గ్రామంలోనీ మూలవగు పరిశీలించిన విప్
- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కోనరావుపేట మండలం (వట్టిమల్ల) / ప్రజాదివాస్ ఆగస్టు 10

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా మార్చడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం కోనరావుపేట మండలం గొల్లపల్లి గ్రామంలో మహిళా సమైక్య భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు..నిమ్మపల్లి ప్రాజెక్టు, వట్టిమల్ల గ్రామంలోనీ మూలవగు పరిశీలించిన విప్ వట్టిమల్ల గ్రామంలోనీ మూలవగు ను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు తెగిపోయిన రహదారినీ పరిశీలించారు.. అనంతరం నిమ్మపల్లి ప్రాజెక్టు వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. మహిళా సంఘాలకు పావలా వడ్డీ రుణాలు అందించి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనని గుర్తుచేశారు.గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా సంఘాలను పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సంఘాల కోసం సుమారు రూ.60 వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. ఇప్పటికే మూడు విడతల్లో వడ్డీ రీయింబర్స్‌మెంట్ చెల్లించామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 42 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని చెప్పారు.సిరిసిల్లలో తయారైన చేనేత చీరలను రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 8 వేల మహిళా సంఘాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, వేములవాడ నియోజకవర్గంలో పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు.200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచడం, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్‌కార్డుల జారీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. ఇళ్లు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సహాయం అందిస్తున్నామని చెప్పారు.తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించి అమలు చేస్తున్నాయని తెలిపారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో తెలంగాణ తరహా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను ఎక్కడా నిలిపివేయకుండా కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు.వేములవాడ రాజన్న ఆలయాన్ని రూ.250 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని ఆది శ్రీనివాస్ తెలిపారు.





నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.కోనరావుపేట మండలంలో త్వరలో వంతెనల నిర్మాణ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పెంటి వాగు, మూలవాగుపై బ్రిడ్జిల నిర్మాణానికి ఇప్పటికే నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు చేపడతామని తెలిపారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.కోనరావుపేట మండలానికి గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సహకారంతో జూనియర్ కళాశాల మంజూరు చేయించినట్లు ఆది శ్రీనివాస్ గుర్తుచేశారు. అధికార పార్టీ సర్పంచులు లేని గ్రామాలకు సైతం అభివృద్ధి నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. త్వరలో గొల్లపల్లికి వాటర్ ప్లాంట్ మంజూరు చేస్తామని చెప్పారు.నియోజకవర్గంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు 3,600 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. పోడు భూముల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, కళ్యాణ మండపం నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

# వేములవాడ భీమన్నను దర్శించుకున్న ప్రముఖ సింగర్ సత్యవతి రాథోడ్ (మంగ్లీ)

- శ్రీ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు
- ఆలయ అర్చకుల ఆశీర్వచనం




వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 10

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని ప్రముఖ గాయని సత్యవతి రాథోడ్ (మంగ్లీ) దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు మంగ్లీకి ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ స్వామి, అమ్మవార్ల శేష వస్త్రంతో పాటు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ పర్యవేక్షకులు పేరుక శ్రీనివాస్, ఆలయ ఉద్యోగులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

# మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్ కి వచ్చే పర్యాటకుల భద్రతకు చర్యలు.

- పర్యాటకులు పోలీస్ వారి సూచనలు, హెచ్చరికలు తప్పనిసరిగా పాటించాలి.
- మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ.

రాజన్న సిరిసిల్ల జిల్లా తగలపల్లి మండలం / ప్రజాదివాస్ ఆగస్టు 10





తంగళ్లపల్లి మండలం గోపాలరావుపల్లి గ్రామ శివారులోని మిడ్ మ్యానేర్ బ్యాక్ వాటర్ ప్రాంతాన్ని ఈరోజు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పోలీసు అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా బ్యాక్ వాటర్ ప్రాంతంలో పర్యాటకుల భద్రత కోసం చేపడుతున్న చర్యలను పరిశీలించారు.పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బ్యాక్ వాటర్ పరిసరాల్లోని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, పర్యాటకులు ఆయా ప్రాంతాలకు వెళ్లకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు, కుటుంబాలతో వచ్చే పర్యాటకుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు.పర్యాటకులు పోలీసుల సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, నీటి ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, సరదా విషాదంగా మారకుండా చూసుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు.ఎస్పీ వెంట డిఎస్పీ నాగేంద్రచారి, సిబ్బంది ఉన్నారు.

# శ్రావణమాసం ఏర్పాట్లపై ఈవో ప్రత్యేక దృష్టి..

- వేములవాడ దేవస్థానం పరిధిలోని అన్ని అనుబంధ ఆలయాల్లో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు..

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 10

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని అన్ని అనుబంధ ఆలయాల్లో రాబోయే శ్రావణమాసం సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లను ఆలయ ఈవో ఎల్. రమాదేవి పరిశీలించారు. శ్రావణమాసంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా నాగుల పంచమి సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉండే





అవకాశం ఉన్నందున, ఆలయాల వద్ద క్యూలైన్లు, దర్శన ఏర్పాట్లు, భక్తుల రాకపోకలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో పాటు స్థానిక గ్రామ ప్రజలు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున, వారి సౌకర్యార్థం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి, దర్శనం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అన్ని అనుబంధ ఆలయాల పరిసరాల్లో పారిశుధ్యం, తాగునీరు, భక్తుల సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను ముందుగానే సిద్ధం చేయాలని, శ్రావణమాసం మొత్తం భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఈవో రమాదేవి ఆదేశించారు. ఈ సందర్భంగా డీఈవో నవీన్ కుమార్, డి ఈ రామ్ కిషన్ రావు , ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్, ఆలయ అర్చకులు, వేద పండితులు తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారుల ఖిల్లాగా హన్మాజీపేట మారాలి డాక్టర్ చెన్నమనేని వికాస్

- గ్రామంలో ‘ఓపెన్ జిమ్’ ప్రారంభం
- యువత క్రీడల్లో రాణించి ఒలింపిక్ పతకాలు సాధించాలి
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం: ప్రతిమ ఫౌండేషన్ ఛైర్మన్ వికాస్

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 10

కళలకు, కళాకారులకు పెట్టింది పేరైన వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేట గ్రామం రాబోయే రోజుల్లో క్రీడాకారుల ఖిల్లాగా రూపాంతరం చెందాలని ప్రతిమ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ చెన్నమనేని వికాస్ దీప దంపతులు ఆకాంక్షించారు. గ్రామపంచాయతీ పాలకవర్గం విజ్ఞప్తి మేరకు గ్రామంలో నూతనంగా అందుబాటులోకి తెచ్చిన ‘ఓపెన్ జిమ్’ను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా వికాస్ మాట్లాడుతూ.. యువత నిరంతరం ఫిట్‌గా ఉంటూ, తమ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. క్రీడలు, వ్యాయామం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘ఖేలో ఇండియా’, టార్గెట్ ఒలింపిక్స్ పథకాలను గ్రామీణ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా మైదానాలు, వ్యాయామ ఉపాధ్యాయులు (పి.ఇ.టి), తగిన సామగ్రిని సమకూర్చితే మన పిల్లలు ఒలింపిక్ పతకాలు సాధించి దేశానికి పేరు తెస్తారని ధీమా వ్యక్తం చేశారు. హన్మాజీపేట ప్రాంత అభివృద్ధికి, యువత ప్రోత్సాహానికి ప్రతిమ ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ



సభ్యులు, బిజెపి జిల్లా, మండల, గ్రామ నాయకులు కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బొల్లారం ప్రభుత్వ పాఠశాలకు బెంచీలు, ఓపెన్ జిమ్ మంజూరు చేయాలని విజ్ఞప్తి

- హన్మాజిపేటలో వికాస్ రావుకు వినతిపత్రం అందజేసిన సర్పంచ్ సౌజన్య మల్లికార్జున్

వేములవాడ / ప్రజాదివాస్ ఆగస్టు 10



వేములవాడ గ్రామీణ మండలం బొల్లారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కావలసిన స్కూల్ బెంచీలు మరియు గ్రామానికి ఓపెన్ జిమ్ ను ప్రతిమ పౌండేషన్ ద్వారా మంజూరు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ సండేరి సౌజన్య మల్లికార్జున్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులు చెన్నమనేని వికాస్ రావు - దీప దంపతులను కలిశారు. వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటలో సోమవారం వారిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల విద్యార్థుల వసతులతో పాటు గ్రామంలోని ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరగా, వికాస్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ నాయకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలో చేరిన 50 కుటుంబాలు

- కాంగ్రెస్ కి భారీ షాక్
- బీ ఆర్ ఎస్ పార్టీలో చేరిన 50 కుటుంబాలు
- కాంగ్రెస్ ని నమ్మి మోసపోయాం
- కెసిఆర్ ని ముఖ్యమంత్రి చెయ్యడమే మా లక్ష్యం అంటున్న గ్రామస్థులు
- కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎం ఎల్ ఏ మెచ్చా





ప్రజాదివాస్
అశ్వారావుపేట మండలంలో అధికార కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది.సహజంగా ఇతర పార్టీల నుంచి అధికారంలో ఉన్న పార్టీలోకి చేరికలు చూస్తాం కానీ అశ్వారావుపేటలో మాత్రం దీనికి బిన్నంగా ఉంది.అధికార పార్టీని వీడి కావడిగుండ్ల మరియు కాలనికి చెందిన సుమారు 50 కుటుంబాలు అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎం ఎల్ ఏ ,బీ ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు సమక్షంలో బీ ఆర్ ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారందరికీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ మాయ మాటలు నామ మేము మోసపోయామని...గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వంలోనే బాగున్నామని. మళ్ళీ కెసిఆర్ ని ముఖ్యమంత్రిగా మెచ్చా నాగేశ్వరరావు ని ఎం ఎల్ ఏ గా చేసుకునేలా కష్టపడుతామని అన్నారు.మెచ్చా. మాట్లాడుతూ ఎప్పటికైనా పల్లెలు బాగుండాలంటే గులాబీ జెండానే ఎగరాలని.నమ్మించి మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ ది అయితే....తెలంగాణ ప్రజలను గుండెల్లో పెట్టుకున్న పార్టీ బీ ఆర్ ఎస్ పార్టీ అని.కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణను బంగారంలా తీర్చిదిద్దుకున్నామని. నేడు కాంగ్రెస్ పరిపాలనలో అభివృద్ధి అటకెక్కిందని.వారి కేవలం సంపాదించుకునే పనిలో మాత్రమే ఉన్నారని. 2సం.లు గడుస్తున్న నియోజకవర్గంలో ఎక్కడా అభివృద్ధి జరగలేదని.తాను ఎం ఎల్ ఏ గా ఉన్న సమయంలో తెచ్చిన పనులను సైతం పూర్తి చెయ్యలేని దుస్థితిలో నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని. పట్టణాల నుంచి పల్లెల దాకా ఒకటే మాట మళ్ళీ కెసిఆర్ రావాలని అంటున్నారని.ఉదాహరణ నేడు మారుమూల ప్రాంతంలో ఒకేసారి అధికార పార్టీనీ కాదని బీ ఆర్ ఎస్ పార్టీలో చేరడమేనని. పార్టీని మారిన్ బలంగా చేసుకునేందుకు అహర్నిశలు కృషి చేస్తానని.మిగిలిన 2సం.లు ప్రతి ఒక బీ ఆర్ ఎస్ కుటుమసభ్యుడిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని.ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే తప్పకుండా వారికి భవిష్యత్తులో బుద్ధి చెప్తామని.గతంలోలా అస్సలు ఉండదని స్పష్టం చేశారు.(పార్టీలో చేరిన వారు కొమరం రవి ,కణితి వెంకటేష్ ,బాలు ,కొమరం హిమ చందు తదితరులు ఉన్నారు)ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసి జూపల్లి రమణారావు , మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి. మోహన్ రెడ్డి , యుఎస్ ప్రకాశ్ రావు ,సంక ప్రసాద్ ,కలపాల బాబురావు ,ఉప సర్పంచ్ పాకనాటి నాగేశ్వరరావు ,మాజీ సర్పంచ్ నారం రాజ్ శేఖర్ ,సంకుల స్వరూపా ,శ్రీదేవి ,ఏలేటి పార్వతి ,కలపాల సురేష్ ,ఆసిఫ్ ,ఆరేపల్లి రాంబాబు ,చిప్పనపల్లి శ్రీను ,ధర్మా. లింగంకుంట కృష్ణ ,బుజ్జి బాబు ,అలా లింగేశ్వర రావు,ఆకుల శ్రీను , చిన్నంశెట్టి రాంబాబు ,వార్డ్ మెంబర్ సురేష్ ,నారాయణ ,జజ్జూరపు రాంబాబు ,దుర్గా రావు ,నార్లపాటి వెంకన్న బాబు ,నందికొల్ల వెంకన్న బాబు ,తుంపాటి రమేష్ ,నార్లపాటి వెంకటేశ్వరరావు,దిలీప్ ,అమీర్ ,నార్లపాటి బన్ను,నార్లపాటి ప్రదీప్ ,నాగు ,ప్రేమ కుమారి , తదితరులు ఉన్నారు.

2

# జవహర్ నగర్‌లో 21 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి, సిసి రోడ్డు పనులకు శ్రీకారం



ప్రజాదివాస్
జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ హైటెన్షన్ రోడ్డులో రూ. 21 లక్షల వ్యయంతో చేపట్టనున్న 90 మీటర్ల అండర్ గ్రావుండ్ డ్రైనేజ , సిసి రోడ్డు అభివృద్ధి పనులను మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్ తో కలిసి అభివృద్ధి పనులను గురువారం ఘనంగా ప్రారంభించారు.ప్రాంతీయ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఈ పనులకు శ్రీకారం చుట్టినట్లు నాయకులు తెలిపారు.ఈ డ్రైనేజీ మరియు రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు ఎంతో కాలంగా ఉన్న మురుగునీటి సమస్యతో పాటు రహదారి కష్టాలు తీరనున్నాయి.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాట్లా వినయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.వారితో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు చింతల శ్రీనివాస్, గజ్వేల్ శంకర్, అబ్బాగోని రాజు గౌడ్, పొలాస కిరణ్ కుమార్, మంద ఆనంద్, తాడి శ్రీనివాస్, మాట్లా శ్రీనివాస్, రఫిక్, పృథ్వి, మంద స్వామి, సోమేశ్, యేసు ఇతర కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని, రూ. 21 లక్షలతో చేపడుతున్న ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

# అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో: రోగుల పట్ల సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం

- ఆధార్ లేకపోతే వైద్య నిరకరణ...
- రోగుల సమస్యల కన్నా సెల్ ఫోన్లకే ప్రాధాన్యత....
- ప్రశ్నిస్తే పక్కవారిని రెచ్చకొడుతున్న సుపారింటెండెంట్.






ప్రజాదివాస్
ఆగష్టు 10 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం అశ్వారావుపేట: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల పట్ల సిబ్బంది ప్రవర్తిస్తున్న తీరు తీవ్ర వివాదాస్పదంగా మారింది. పేషెంట్ల ప్రాణాల కంటే సిబ్బందికి తమ సెల్ ఫోన్లే ముఖ్యం అన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఆధార్ కార్డు లేకపోతే వైద్యం నిరాకరణ:**

ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగులకు కనీస వైద్య సేవలు అందించడంలో సిబ్బంది పూర్తిగా విఫలమవుతున్నారు. అత్యవసర స్థితిలో చికిత్స కోసం వచ్చే రోగులను "ఆధార్ కార్డు లేకపోతే బయటకు వెళ్లిపోండి" అంటూ సిబ్బంది దురుసుగా సమాధానం ఇస్తూ గెంటివేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేదలకు ప్రాథమిక చికిత్స అందించాల్సింది పోయి, గుర్తింపు కార్డుల పేరుతో బయటకు పంపించడంపై బాధితులు కన్నీరు మున్నీరవుతున్నారు.

**రోగుల సమస్యల కన్నా సెల్ ఫోన్లకే ప్రాధాన్యత:**

ఆసుపత్రికి వచ్చే రోగులు తమ బాధలను చెప్పుకుంటున్నా, అక్కడి సిబ్బంది మాత్రం వాటిని పట్టించుకోకుండా తమ సెల్ ఫోన్లలో నిమగ్నమై కాలక్షేపం చేస్తున్నట్లు రోగులు వాపోతున్నారు. డ్యూటీలో ఉండి కూడా బాధ్యతారాహిత్యంగా ఫోన్లతో గడపడం ఇక్కడి సిబ్బందికి అలవాటుగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రశ్నిస్తే రెచ్చగొడుతున్న సూపరింటెండెంట్! సిబ్బంది ప్రవర్తనపై బాధితులు, "ఇదేమిటి" అని నిలదీస్తే.. సమస్యను రిష్కరించాల్సిన హాస్పిటల్ సూపరింటెండెంట్ మరింత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. పాత విషయాలను మనసులో పెట్టుకొని, వైద్యం కోసం వచ్చిన వారిని కాపాడాల్సింది పోయి.. పక్కన ఉన్న వారిని రెచ్చగొడుతూ గొడవలకు దారితీసేలా ప్రవర్తిస్తున్నారని రోగుల కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రజాధనంతో జీతాలు తీసుకుంటూ, ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న ఇలాంటి సిబ్బందిపై మరియు సూపరింటెండెంట్ తీరుపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# చిన్న చెన్నయ్య మాతృ మూర్తి భౌతిక ఖాయానికి ఘన నివాళులర్పించిన జనసేన నాయకులు కార్యకర్తలు



ప్రజాదివాస్
ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం వెలది కొత్తపాలెం గ్రామం లో సోమవారం రోజున జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బర్ల చిన్న చెన్నయ్య వారి మాతృమూర్తి భౌతిక ఖాయాన్ని సందర్శించి ఘన నివాళులు అర్పించిన జనసేన మండల పార్టీ అధ్యక్షులు శ్రీ వడ్డెల్లి సుధాకర్ మరియు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సూర సత్యనారాయణ జనసేన నాయకులు కుటుంబరావు తాళ్లపల్లి నాగరాజు మరియు జనసేన పార్టీ కార్యకర్తలు ఆ కుటుంబ సభ్యులను ఓదార్చి ఆ కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు

# ఆధ్యాత్మికతతో పాటు ప్రజాసేవే లక్ష్యం షిరిడి సాయిబాబా ఆశీస్సులతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



ప్రజాదివాస్
చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామంలో నిర్వహించిన షిరిడి సాయిబాబా 11వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య భక్తులు మహిళలు కూటమి నాయకులు కార్యకర్తలతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు గ్రామ పెద్దలు భక్తులు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఘన స్వాగతం పలికారు సాయిబాబా వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె భక్తులతో ఆప్యాయంగా మమేకమై గ్రామ ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు శ్రద్ధ సబూరి అనే సాయిబాబా సందేశం ప్రతి ఒక్కరికీ ఆదర్శం అని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత సేవాభావం మానవతా విలువలను పెంపొందిస్తాయని అన్నారు ప్రజల విశ్వాసాలు సంప్రదాయాలకు గౌరవం ఇస్తూనే నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు ఆలయ కమిటీ సభ్యులు మహిళలు భక్తులు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# అందోల్ నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం

- ఎమ్మార్పీఎస్ గ్రామ మండల కమిటీ యుద్ధ ప్రాతిప్రాధికను పూర్తి చేయాలి.
- జిల్లా ఇన్చార్జి వి ఎస్ రాజు మాదిగ.






ప్రజాదివాస్
అందోల్ నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీల గురించి జిల్లా ఇన్చార్జి వి ఎస్ రాజు మాట్లాడుతూ మండల కమిటీలు త్వరగా పూర్తి చేసుకోవాలని నిబంధనతో పని చేయాలని వరంగల్లో సెప్టెంబర్ 9 జరిగే ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సుకు పూర్తిస్థాయి మండల కమిటీలను పెద్ద ఎత్తున తరలించాలని జిల్లా ఇన్చార్జ్ వి ఎస్ రాజు మాదిగ అన్నారు. భవిష్యత్తులో కార్య చరణకు మాదిగ విద్యార్థులు యువత మహిళలు పెద్ద ఎత్తున సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అందోల్ మండలం ఇంచార్జ్ తుడుం రాములు మాదిగ, చౌటాకుర్ మండలం ఇంచార్జ్ ఎర్రోళ్ల రమేష్ మాదిగ , వట్పల్లి మండల ఇన్చార్జ్ బురగల ప్రభాకర్ మాదిగ, పుల్కల్ మండలం ఇంచార్జ్ నడిమి దొడ్డి సాయికృష్ణ మాదిగ, మేతరి బాలరాజ్ మాదిగ, మునిపల్లి మండలం జంగం నవీన్ మాదిగ, కోఆర్డినేటర్ విజయ్ కుమార్ మాదిగ, రాయికోడ్ మండలం శ్రీకాంత్ మాదిగ లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గంధ గల వీరయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నాలోళ్ళ ప్రవీణ్ కుమార్, పుర్ర సంతోష్,పాపయ్య మాదిగ, యశ్వంత్ మాదిగ, ప్రసాద్ మాదిగ, నవీన్ మాదిగ, యేసయ్య మాదిగ, ఉషయ్య మాదిగ, బాలయ్య మాదిగ, చిన్నల్లి రాములు మాదిగ, అందోల్ నియోజకవర్గ మాదిగ కుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని, ఫారెస్ట్ రైట్ యాక్ట్ వన్ ఆఫ్ సెవెంటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. కామ్రేడ్ మోడం మల్లేశం డిమాండ్.

ప్రజాదివాస్

ఆగస్టు 10 ఈరోజు దేశవ్యాపిత జైల్ బరో కార్యక్రమం రాష్ట్రవ్యాపిత రాస్తారోకోలకు, ఎస్.కె.ఎం కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా వరంగల్ జిల్లా నర్సంపేట సెంటర్లో ఈరోజు వివిధ కార్మిక రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఐఎఫ్ టి యు (న్యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ మోడం మల్లేశం కేంద్ర ప్రభుత్వం మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి దేశంలోని పబ్లిక్ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరణ చేస్తూ అమెరికా తదితర పెట్టుబడి దారి దేశాలతో స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటూ దేశంలోని సంపదలను బహుళ జాతి కంపెనీలకు కట్టబెడుతుంది వెంటనే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలను రద్దు చేయాలని,అనేక సంవత్సరములుగా పోరాడి సాధించుకున్న 44 రకాల కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చి దేశంలోని కార్మిక వర్గ శ్రమను కారు చౌకగా బడా బాబులకు కట్టబెడుతుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని, అంగన్వాడి, ఆశ,మిద్దె మిల్స్ తదితర స్కీన్ వర్కర్లను అవుట్సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయకుండా వారి శ్రమను దోచుకుంటుంది.భవన నిర్మాణం, హమాలి, ట్రాన్స్పోర్ట్ తదితర , అసంఘటితరంగా కార్మికులందరికీ సంక్షేమ పథకాలతో సమగ్ర చట్టం చేయాలని,అన్ని పంటలకు ఉత్పత్తి ఖర్చులపై అదనంగా 50% కలిపి మద్దతు ధర నిర్ణయించాలని,ఉపాధి హామీ పనులు ఏడాదికి 200 రోజులు కల్పించాలని,రోజుకు 700 రూపాయలు కనీస వేతనం ఇవ్వాలని, స్టీల్ ప్లాంట్,విద్యుత్, ఆర్టీసీ మున్సిపాలిటీలతో సహా ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రైవేటీకన విధానాలు ఆపాలని,విత్తన బిల్లు,ఆహార భద్రత సవరణ బిల్లు ఉపసంహరించుకోవాలని, కార్పొరేట్ల కోసం నిర్బంధ ఖండా ఆపాలని,2013 భూసేకరణ చట్టం అమలు చేయాలని, ఫారెస్ట్ రైట్ యాక్ట్,వన్ ఆఫ్ సెవెంటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు కూలీ సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఈర్ల పైడి ఎం సి పి ఐ యు ప్రజా సంఘాల నాయకులు కన్నము





వెంకన్న,రాజా సాహెబ్,రాగ సుధా,రాజమౌళి, సింగతి మల్లికార్జున్ సిపిఎం ప్రజా సంఘాల నాయకులు ఈసంపల్లి బాబు,కోరబోయిన కుమారస్వామి,హనుమకొండ శ్రీధర్ న్యూ డెమోక్రసీ నాయకులు జక్కుల తిరుపతి,ప్రదీప్ మల్లన్న, రంజితు,సిపిఎంఎల్ మాస్ లైన్ నాయకులు అడ్డూరి రాజు, లింగయ్య,సిపిఐ నాయకులు అక్క పెల్లి రమేష్, తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు సుక్క వీరన్న,భునగిరి సారయ్య, మదార్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌తో సమావేశమైన టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

ప్రజాదివాస్

హైదరాబాద్: సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా టీపీసీసీ ఉపాధ్యక్షులకు గాంధీభవన్‌లో సోమవారం వన్ టు వన్ సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ తరఫున ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ఈ సమావేశాన్ని నిర్వహించి, పార్టీ సంస్థాగత బలోపేతం, కార్యక్రమాల అమలు తదితర అంశాలపై ఉపాధ్యక్షులతో





చర్చించారు.ఈ సమావేశంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, కుమురంభీమ్ ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచిన్ సావంత్‌ను ఆత్రం సుగుణక్క శాలువాతో సత్కరించారు.సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు.

# మాతృవియోగంలో ఉన్న మడే బిక్షపతిని పరామర్శించిన ఎస్సీ ఎస్టీ టీచర్స్ అసోసియేషన్

ప్రజాదివాస్

ములుగు జిల్లా మంగపేట మండలం నరసాయగూడెం మండలానికి చెందిన మాడే బిక్షపతి ఎస్సీ ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లి ఇటీవల అనారోగ్య కారణము వలన మరణించడం జరిగింది ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ఎస్సీ ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర శాఖ తరపున అధ్యక్షులు గొర్రె విజయభాస్కర్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు దుప్పటి సుందర్ ఆధ్వర్యంలో సోమవారం నాడు హనుమకొండ లోని వారి నివాసంలో సందర్శించి వారికి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు తల్లి మరణం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ వారి తల్లిగారు వారిని విద్యావంతులుగా తీర్చిదిద్ది సమాజానికి ఆదర్శవంతంగా ఉపాధ్యాయునిగా తయారుచేసి గొప్ప స్థానంలో నిలిపారని మడే ముతక్క వారి జీవితాంతం ఎంతో సేవ చేశారని ఆదివాసి కుటుంబంలో పుట్టి తన పిల్లల్ని విద్యావంతుని చేసి నేడు సమాజంలో ఉన్నత స్థానంలో నిలిపారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు



మడే బిక్షపతి ఉపాధ్యాయ వృత్తిలో భూపాలపల్లి జిల్లాలో ఎమ్మార్పీగా ఎంతోమంది ఉపాధ్యాయులకు సేవ చేశారని విద్యార్థిని విద్యార్థులకు ఎంతో విద్యను అందజేసి ఉత్తమ ఉపాధ్యాయుగా ఎదిగారని ఉపాధ్యాయ సంఘం లో కీలక పాత్ర పోషిస్తూ సామాజిక సమస్యల్లో కూడా ముందుండి పోరాడుతూ ఆదివాసి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ ఆదివాసి సమాజం కోసం కూడా ఎంతో కృషి చేస్తూ నేడు రాణిస్తున్నారు అంటే వారి తల్లి చూపిన మార్గం చాలా గొప్పదని ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ శాఖ పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారు ధైర్యాన్ని కుడగట్టుకుని వారి తల్లి ఆశయాలను నెరవేర్చే విధంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులు ఎస్సీ ఎస్టీ టీ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జిల్లెల్ల దేవేందర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దుప్పటి సుందరం శనగరపూ సాంబయ్య జిల్లెళ్ళ కుమారస్వామి గోల్కొండ ఐలయ్య చెరుపల్లి ప్రభుదాస్ ఇంజపల్లి భద్రయ్య దుప్పటి మొగిలి ఒంటేరు ప్రభాకర్ మొదలగు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పరకాలలో ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ విజయవంతం చేయాలి

**- పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి**



ప్రజాదివాస్

సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్ మరియు పరకాల,నడికూడ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.నిర్వహించారు.ఈ నెల 16వ తేదీన పరకాల పట్టణ కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే బహిరంగ సభను అత్యంత విజయవంతం చేయడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు. బూత్ లెవెల్ నుంచి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి, ప్రజలను పెద్ద ఎత్తున సభకు తరలించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.కమిట్‌మెంట్‌తో కూడిన బలమైన ఆర్గనైజేషన్‌తో ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో సమన్వయంతో పనిచేస్తే సభ చారిత్రాత్మక విజయాన్ని సాధిస్తుందని అన్నారు.సభ ఏర్పాట్లు, ప్రజల రవాణా, ప్రచార కార్యక్రమాలు, బాధ్యతల కేటాయింపు తదితర అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.

# వరంగల్ ఐటీఐని 'హబ్'గా అప్ గ్రేడ్ చేయాలి

**- పీఎం-సేతు కింద హాస్టల్ మంజూరు చేయండి**

**- కేంద్ర మంత్రి జయంత్ చౌదరికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వినతి**

ప్రజాదివాస్

వరంగల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)ను పీఎం-సేతు పథకం కింద 'స్పోక్' నుంచి 'హబ్'గా అప్‌గ్రేడ్ చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరిని కోరారు. సోమవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం అందజేసి వివరించారు.1959లో ఏర్పాటైన వరంగల్ ప్రభుత్వ ఐటీఐలో ప్రస్తుతం సుమారు 1,402 మంది శిక్షణ పొందుతున్నారని ఎంపీ డా.కడియం కావ్య తెలిపారు. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉన్నందున సంస్థను ఆధునిక సౌకర్యాలతో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎస్‌సీసీఎల్ భూపాలపల్లి, ఎన్టీపీసీ రామగుండం, కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్, కాజీపేట--వరంగల్ రైల్వేతో పాటు ఇతర పారిశ్రామిక రంగాల విస్తరణతో భవిష్యత్తులో నైపుణ్యం కలిగిన మానవ వనరులకు భారీగా డిమాండ్ ఏర్పడనుందని కడియం కావ్య వివరించారు. ఐటీఐని హబ్‌గా అభివృద్ధి చేస్తే ఆధునిక సాంకేతిక పరికరాలు, పరిశ్రమలకు అవసరమైన కోర్సులు, అప్రెంటిస్‌షిప్, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని తెలిపారు.వరంగల్ ప్రభుత్వ ఐటీఐని హబ్‌గా, హనుమకొండ, కాజీపేట, భూపాలపల్లి, మహబూబాబాద్‌లోని సంబంధిత సంస్థలను స్పోక్‌లుగా అభివృద్ధి చేయాలని ఎంపీ ప్రతిపాదించారు. దీనివల్ల ఉమ్మడి ప్రాంతంలో నైపుణ్య శిక్షణను సమన్వయంతో విస్తరించి, అధిక సంఖ్యలో యువతకు ఆధునిక శిక్షణ అందించవచ్చని పేర్కొన్నారు.వరంగల్ ప్రభుత్వ ఐటీఐలో ప్రస్తుతం ప్రత్యేక హాస్టల్ సదుపాయం లేదని, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు నిత్యం సుదూర ప్రయాణాలు చేయాల్సి వస్తోందని



కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పీఎం-సేతు కింద ఆధునిక శిక్షణ సదుపాయాలు కల్పిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల వసతి, భోజనం, పారిశుద్ధ్యం, చదువు తదితర సౌకర్యాలతో కూడిన హాస్టల్ భవనాన్ని మంజూరు చేయాలని కోరారు.వరంగల్ ఐటీఐని హబ్‌గా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు హాస్టల్ భవనానికి ప్రాధాన్యం ఇచ్చి మంజూరు చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని కేంద్ర మంత్రి జయంత్ చౌదరిని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

# హన్మకొండలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిసిన కందుకూరి నరేష్

**- టీడీపీ పరకాల నియోజకవర్గ బాధ్యులు కందుకూరి నరేష్**

ప్రజాదివాస్

హన్మకొండలో రీషా హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ని టీడీపీ పరకాల నియోజకవర్గ బాధ్యులు కందుకూరి నరేష్ మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయంగా మాట్లాడారు.ఈ



సందర్భంగా రీషా హాస్పిటల్ ప్రారంభోత్సవానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలకు నాణ్యమైన మరియు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.అనంతరం పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై ఆత్మీయంగా చర్చించారు. ప్రజా సేవే లక్ష్యంగా టీడీపీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామని కందుకూరి నరేష్ తెలిపారు.

ప్రజా దివాస్
తెలుగు దినపత్రిక
10-08-2026

# పుల్కల్‌లో సర్పంచ్ భర్త పెత్తనంపై ఆరోపణలు

**– ప్రభుత్వ ఉద్యోగిగా ఉంటూనే గ్రామ కార్యక్రమాల్లో పాల్గొనడంపై చర్చ**





ప్రజాదివాస్

పుల్కల్ గ్రామ సర్పంచ్ లావణ్య భర్త కృష్ణారెడ్డి గ్రామ పరిపాలన వ్యవహారాల్లో చురుకుగా జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్పంచ్ భర్తగా గ్రామంలో అన్ని తానై వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా, కృష్ణారెడ్డి ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నప్పటికీ గ్రామంలో జరుగుతున్న పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, తాజాగా గ్రామంలో గడ్డి మందు పిచికారీ కార్యక్రమంలో కూడా పాల్గొన్నట్లు ఈ ఫొటో ద్వారా తెలుస్తోంది.ప్రభుత్వ ఉద్యోగి గ్రామ పంచాయతీ కార్యకలాపాల్లో ఏ హోదాలో పాల్గొంటున్నారు ఆయనకు అధికారికంగా ఏమైనా బాధ్యతలు అప్పగించారా అనే విషయాలపై స్థానికంగా చర్చ జరుగుతోంది. సంబంధిత అధికారులు స్పందించి వాస్తవాలను స్పష్టం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

**గమనిక:**

ప్రభుత్వ ఉద్యోగి రాజకీయ/పంచాయతీ కార్యకలాపాల్లో పాల్గొనడంపై వర్తించే నిబంధనలు, ఆయనకు ఉన్న అధికారిక బాధ్యతలు వంటి అంశాలను సంబంధిత అధికారుల నుంచి ధృవీకరించాల్సి ఉంది.

# రుద్రవరం పాఠశాలలకు మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు చేయాలని విజ్ఞప్తి

**– హన్మాజిపేటలో వికాస్ రావుకు వినతిపత్రం అందజేసిన రుద్రవరం సర్పంచ్ సునీత రాజిరెడ్డి**





ప్రజాదివాస్

వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలోని ప్రాథమికోన్నత (ఖూా), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల (గ్రానూ) విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కోసం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరుతూ సర్పంచ్ ఊరాడి సునీత రాజిరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు, బిజెపి నాయకులు చెన్నమనేని వికాస్ రావు – దీప దంపతులను కలిశారు. వేములవాడ రూరల్ మండలం హన్మాజిపేటలో వారిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛమైన తాగునీటిని అందించడానికి మినరల్ వాటర్ ప్లాంట్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా, వారు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊరడి సునీత రాజిరెడ్డి, బిజెపి అర్బన్ మండల అధ్యక్షుడు డాక్టర్ శేఖర్, వార్డు సభ్యులు అలిపిరి సురేష్ రెడ్డి, తాడేం లత శ్రీనివాస్, కట్ట సంపత్, గుండెల్లి శ్రీనివాస్, డాక్టర్ విశ్వనాథం శ్రీధర్, ఎరుగోక్కుల రమేష్, తాడేం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తి తో జైల్ బరో






ప్రజాదివాస్

బూర్గంపాడు మండల కేంద్రంలో రాస్తారోకో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేయటం జరిగింది పోలీసులు బలవంతంగా లాక్కెళ్ళి కారులో ఎక్కించి పోలీస్ స్టేషన్కు తరలించారు బత్తుల వెంకటేశ్వర్లు రాయల వెంకటేశ్వర్లు వారితోపాటు అందరిని స్టేషన్ కి తరలించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలీస్ బలవంతంగా కేంద్రం బిజెపి ప్రభుత్వం కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలు కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో జైలు బోరో దేశవ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా కార్యక్రమం జరిగింది కార్మికులు రైతులు వ్యవసాయ కూలీలు ప్రజాస్వామ్య వాదులు పాల్గొని జయప్రదం చేయటం జరిగింది కేంద్ర ప్రభుత్వం నయా ఉదారవాదం సంస్కరణనలను దుందుడుకు అమలు చేస్తుందని అందులో భాగంగానే నాలుగు లేబర్ కోడ్ లు అమలు చేస్తుందని విద్యుత్తు సవరణ బిల్లు 2025 విత్తనం చట్టానికి సవరణలు పదిపాదించారు సులభతర వ్యాపారం పెట్టుబడిదారుల చేతిలోకి లాభాలు చేకూర్చింది వి బిజీ రాంజీ చట్టాన్ని తీసుకొచ్చి ఉపాధి కార్మికుల పొట్ట కొడుతున్న కేంద్రం మోడీ ప్రభుత్వం 40% రాష్ట్రాలు భరించాలని 60 శాతమే కేంద్ర ప్రభుత్వం భరిణిస్తుందని అది కూడా రాష్ట్రాలు ఖర్చుపెట్టి కేంద్రానికి పంపిస్తే 60% ఇస్తామని చెప్పటం వల్ల ఉపాధి పని పూర్తిగా నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఉందని అన్నారు ఉపాధి కార్మికుల పని ఉండాలంటే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని చట్టం అమలు చేయాలని డిమాండ్ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలని రద్దు చేయాలని సూచించారు రైతులు ప్రాణాలకే ఉరితాడు లాగా అమెరికా నుండి పత్తి దిగుమతి 40 లక్షల బేళ్ల అదనంగా దిగుమతి చేసుకోవడంతో ఎటువంటి సుంకాలు లేకుండా దిగుమతి అవుతుంది మన దేశంలో ప్రతి ధరలు పడిపోయాయి కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చాయి భారతదేశంలో ఏటా 18 లక్షల కోట్ల వ్యవసాయ ఉత్పత్తులు మార్కెట్కు వస్తునంగా కనీసం మద్దతు ధరలు అమలు జరగకపోవడం వల్ల రైతులు వేట 18 లక్షల కోట్ల మార్కెట్కు వస్తుండగా మద్దతు ధరలు అమలు జరగకపోవడం వల్ల రైతులు ఏట 4 లక్షల కోట్లు నష్టపోతున్నారని అన్నారు

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఎస్కే అబిద సిఐటియు మండల నాయకులు ఐద్వా మండల కార్యదర్శి పాపినేని సరోజన కెవిపిఎస్ మండల కార్యదర్శి రాయల వెంకటేశ్వర్లు రైతు సంఘం మండల కార్యదర్శి కాదుకూరి నాగేశ్వరావు మరియమ్మ నిమ్మల అప్పారావు ప్రతాప్ ఆ దూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

# పీఎం జన్‌ధన్ యోజనతో గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవల విస్తరణపై లోక్‌సభలో ప్రశ్నించిన కడియం కావ్య

**– వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య**



ప్రజాదివాస్

వరంగల్ జిల్లాలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన కింద ఆర్థిక సేవల పరిస్థితి, జనధన్ ఖాతాల సంఖ్య, రూపే కార్డుల జారీ, ఆధార్ అనుసంధానం, ఖాతాల నిర్వహణ, డీబీటీ ప్రయోజనాలపై వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గత మూడేళ్లలో డిజిటల్ చెల్లింపుల ప్రోత్సాహం, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ మౌలిక వసతుల విస్తరణపై కూడా వివరాలు కోరారు. వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిచ్చారు. వరంగల్ జిల్లాలో పీఎంజేడీవై ఖాతాలు 2024 మార్చిలో 2,69,894 ఉండగా.. 2026 మార్చి నాటికి 3,02,317కు పెరిగాయి. ఇదే సమయంలో ఆధార్‌తో అనుసంధానమైన ఖాతాలు 2,18,133 నుంచి 2,65,470కు చేరాయి. రూపే కార్డులు 2,12,030 నుంచి 2,26,409కు పెరిగాయి.జన్‌ధన్ ఖాతాల సంఖ్య పెరిగినప్పటికీ ఆపరేటివ్ ఖాతాల సంఖ్యలో తగ్గుదల నమోదైంది. 2024 మార్చిలో 2,28,257 ఖాతాలు ఆపరేటివ్‌గా ఉండగా 2026 మార్చి నాటికి ఆ సంఖ్య 2,20,607కు తగ్గింది. పీఎంజేడీవై ఖాతాలకు అనుసంధానమైన డీబీటీ పథకాల వివరాలను కేంద్ర స్థాయిలో ప్రత్యేకంగా నిర్వహించడం లేదని కేంద్ర మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య మాట్లాడుతూ,జిల్లాలో జనధన్ ఖాతాల సంఖ్య పెరగడం స్వాగతించదగ్గ పరిణామమే అయినప్పటికీ, ఖాతాలు తెరవడమే కాకుండా అవి నిరంతరం వినియోగంలో ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ, పేద, అణగారిన వర్గాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా చేరేందుకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభతరం చేయాలన్నారు. డిజిటల్ చెల్లింపులపై అవగాహనను మరింత విస్తరించి, మహిళలు, రైతులు, కూలీలు, చిన్న వ్యాపారులు సహా ప్రతి వర్గానికి ఆర్థిక అక్షరాస్యత కల్పించాలని పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో బ్యాంకింగ్ మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి, ప్రతి అర్హుడికి బ్యాంకింగ్ సేవలు, డీబీటీ ప్రయోజనాలు అందేలా కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలి అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కోరారు.

# చలో ఢిల్లీని జయప్రదం చేయండి.......

**– భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ పిలుపులో భాగంగా: బద్లావ్ జరూరి హై:**

**– మార్పు కావాలి : సెప్టెంబర్ 1. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని తలపెట్టింది.**




ప్రజాదివాస్

జాతీయ మరియు తెలంగాణ రాష్ట్ర పిలుపులో భాగంగా ప్రజా చైతన్య యాత్రలు ఆగస్టు6నుండి 14వరకు జయప్రదం చేయండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం పార్టీ కార్యాలయంలో కోకలకుంట సత్యనారాయణ అధ్యక్షతన జరిగినటువంటి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మండల కార్యదర్శి సుంకిపాక ధర్మ మాట్లాడుతూ. భారతదేశం నేడు అనేక కష్టాల్లో ఉంది అందుకు కారణం మోడీ ప్రభుత్వం కేంద్రంలో బిజెపి అధికారంలో ఉన్న ఈ దశాబ్ద కాలంలో ఎన్నికల సందర్భంగా బిజెపి.. అభివృద్ధి ఉపాధి సంక్షేమం సుపరిపాలన మరియు మెరుగైన భవిష్యత్తును అందిస్తామని వాగ్దానం చేసింది కానీ దానికి బదులుగా దేశంలో నేడు పెరుగుతున్న నిరుద్యోగం భరించలేని ద్రవయోల్బణం ( ధరల పెరుగుదల ) విస్తరిస్తున్న అసమానతలు బలహీనపడిన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుంచించుకుపోతున్న ప్రజాస్వామ్యం మరియు పెరుగుతున్న సామాజిక ఉద్రిక్తలను ఎదుర్కొంటుంది.. అయినప్పటికీ మోడీ ప్రభుత్వం నుండి ఈ ప్రశ్నలకు సమాధానం కావాలని కోరినప్పుడల్లా ఈ చర్చను ఇతర అంశాల వైపులకు మళ్లిస్తున్నారు దేశంలో ఉన్న విద్య ఉద్యోగం నిరుద్యోగం కార్మిక సమస్యలు ప్రజా సమస్యలపై మొగ్గ చూపాల్సిన ప్రభుత్వం కులాల పేరిట మతాల పేరిట వర్గాల పేరిట రాజకీయం చేయడానికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుంది ఒకపక్క పెరిగిపోతున్న నిరుద్యోగంతో పాటు ధరలు పెరుగుదల కూడా ప్రజలపై ఒక మోయలేని భారంగా మారింది మార్కెట్ కు వెళ్ళిన ప్రతిసారి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమ ఆదాయాలు పెరగడం లేదని చేదు నిజం ప్రజలకు గుర్తొస్తూనే ఉంది ఆహార పదార్థాలు వంటగ్యాస్ రవాణా విద్యుత్తు వైద్యం మరియు విద్యా ఖర్చులు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి అందుకోసమే భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఒక వినూత్నమైన ప్రజా మార్పుకై శ్రీకారం చుట్టింది గల్లీలోనే కాదు ఢిల్లీలో కూడా ప్రజా సమస్యలపై పోరాడుతామని... నియంత బిజెపి నిరంకుష్పాలనపై పిడికిలెత్తి పోరాడుతామని యువతకు అండగా నిలుస్తామని పిలుపునిచ్చింది.... ఈ కార్యక్రమంలో యార్లగడ్డ ఈశ్వరరావు కోకోలకుంట సత్యనారాయణ ఎస్ కే జాన్ బీ నక్క నాగమణి గాజుబోయిన కృష్ణవేణి మెరుగు వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు



# సిద్ధుతో మీనాక్షి

'సంక్రాంతికి వస్తున్నాం', 'అనగనగా ఒక రాజు' చిత్రాలతో వరుస విజయాలందుకుని జోరుమీదుంది మీనాక్షి చౌదరి. ఇప్పుడామె తెలుగులో నాగచైతన్యతో 'వృషకర్మ'లో నటిస్తూనే.. మరోవైపు కల్యాణ్ శంకర్ దర్శకత్వంలో కార్తితో ఓ సినిమా చేస్తోంది. అయితే ఇప్పుడామె ఖాతాలో మరో ప్రాజెక్ట్ చేరింది. తను త్వరలోనే తెలుగులో తొలి వెబ్‌సిరీస్‌తో అలరించనుంది. ప్రస్తుతం సిద్ధు జొన్నలగడ్డ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ సిరీస్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో మీనాక్షి కథానాయికగా నటిస్తున్నట్లు దర్శకుడు వెంకీ స్పష్టత ఇచ్చారు. ఇప్పటికే ఈ వెబ్‌సిరీస్ చిత్రీకరణ మొదలైందని.. వచ్చే ఏడాది ప్రథమార్థంలో నెట్‌ఫ్లిక్స్ వేదికగా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముందని తెలియజేశారు. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి.

# నవ్వించే తారలు వస్తున్నారు



ఎలాంటి అంచనాలు లేకుండా థియేటర్లలోకి వచ్చి.. ప్రేక్షకుల్ని మెప్పించే చిత్రాలు చాలానే ఉంటాయి. అందులో ముందు వరుసలో ఉంటుంది 'మలమాల్ వీక్లీ' చిత్రం. హిందీ నటులు పరేశ్ రావెల్, రితేశ్ దేశ్‌ముఖ్, రాజ్‌పాల్ యాదవ్ తదితరులు నటించిన ఈ సినిమా 2006లో విడుదలై ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించింది. ప్రియదర్శన్ తెరకెక్కించిన ఈ చిత్రానికి సీక్వెల్ రాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ చిత్రంలో ప్రధాన పాత్రధారులుగా రవీనా టాండన్, పరిణీతి చోప్రాను ఎంపిక చేసిందట చిత్రబృందం. "నేటి యువతను దృష్టిలో పెట్టుకొని ఈ సీక్వెల్ స్క్రిప్ట్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఆ కథకు పరిణీతి, రవీనా అయితేనే సరిగ్గా సరిపోతారు. నవ్వించడానికి త్వరలోనే ఈ తారలు తెరపైకి రాబోతున్నారు. వీరిద్దరికీ కూడా స్క్రిప్ట్, వారి పాత్రలు నచ్చి.. వెంటనే ఒకే చెప్పేశార"ని బాలీవుడ్ వర్గాలు తెలిపాయి.




# వేట కత్తితో మాస్ లుక్‌లో

'ఇరుముడి' సినిమాతో బాక్సాఫీస్ బరిలో సందడి చేయనున్నారు కథానాయకుడు రవితేజ. ఆయన.. ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని శివ నిర్వాణ తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. బేబీ నక్షత్ర, సాయికుమార్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 21న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 12న భీమవరంలో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు శనివారం ప్రకటించారు. ఈమేరకు ఓ కొత్త పోస్టర్‌ని నెట్టింట పంచుకున్నారు. అందులో రవితేజ నోటిలో వేట కొడవలితో మాస్ లుక్‌లో.. అయ్యప్ప భక్తుడిలా మాలధారణలో రెండు కోణాల్లో కనిపించారు. తండ్రీ కూతుళ్ల అనుబంధాలతో అల్లుకున్న యాక్షన్ కథతో ఈ సినిమా ముస్తాబైంది. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్.

# రామోజీ ఫిల్మ్‌సిటీలో ఫౌజీ పోరు



కథానాయకుడు ప్రభాస్, దర్శకుడు హను రాఘవపూడి కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'ఫౌజీ'. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఇమాన్వి కథానాయిక. అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భానుచందర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా డిసెంబరు 3న తెరపైకి రానుంది. ఈ నేపథ్యంలోనే మిగిలిన చిత్రీకరణను చకచకా పూర్తి చేసే పనిలో పడింది చిత్ర బృందం. దీనిలో భాగంగా ప్రస్తుతం రామోజీ ఫిల్మ్‌సిటీలో భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కిస్తున్నారు. దాదాపు మూడు వారాల పాటు సాగే షెడ్యూల్ ఇదని.. ఈ యాక్షన్ సీక్వెన్స్ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచేలా ఉంటుందని తెలుస్తోంది. చారిత్రక అంశాలతో ముడిపడిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా ఇది. దీనికి విశాల్ చంద్రశేఖర్ స్వరాలందిస్తుండగా.. సుదీప్ ఛటర్జీ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

# నా కంఫర్ట్ జోన్ దాటి చేసిన సినిమా.. టాక్సిక్ ట్రైలర్ వేడుకలో యశ్



"శాంతి వల్ల అంతా బాగుంటే శతాబ్దాలుగా యుద్ధాలెందుకు జరిగేవి" అంటున్నారు కథానాయకుడు యశ్. ఇప్పుడాయన నుంచి రానున్న పాన్ ఇండియా సినిమా 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. కియారా అద్వాణీ కథానాయిక. నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 26న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి బెంగళూరులో హీరో శివ రాజ్‌కుమార్ ఈ చిత్ర ట్రైలర్‌ని విడుదల చేశారు. "ముసుగేసుకుని మొహం మీదున్న దుఃఖాన్ని దాచిపెట్టొచ్చు. నుదిటిపై రాసిన విషాదాన్ని దాచలేం" అంటూ కియారా చెప్పే డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం యశ్ మాస్ యాక్షన్ హంగామాతో ఆసక్తి రేకెత్తిస్తూ సాగింది. దాదాపు నాలుగున్నర నిమిషాలకు పైగా నిడివితో ఉన్న ఈ ప్రచార చిత్రంలో టాక్సిక్ ప్రపంచాన్ని.. అందులోని ప్రధాన పాత్రల్ని.. వాటి మధ్య ఉన్న సంఘర్షణని ఆకట్టుకునేలా పరిచయం చేశారు. యశ్ ఇందులో తండ్రీ కొడుకులుగా రాయా, రూమి అనే రెండు పాత్రల్లో కనిపించనున్నట్లు అర్థమవుతోంది. ఆ తండ్రీ కొడుకులు బద్ధ శత్రువులుగా ఎందుకు మారాల్సి వచ్చింది.. వాళ్లిద్దరి పోరులో గెలిచిందెవరు? అన్నది ఆసక్తికరం. ట్రైలర్‌లో యశ్ వైల్డ్ యాక్షన్, మాస్ ఎలివేషన్లు ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా యంగ్ గెటప్‌లో ఆయన సృష్టించిన విధ్వంసం.. ఈ సినిమాలో హింస, రక్తపాతం ఏ స్థాయిలో ఉండనుందన్నది తెలియజేస్తోంది. "అమ్మాయిలకి అందమే అసలైన సింగారం. ఆ అందాన్ని ఆయుధంగా వాడితే ఎలా బంగారం", "ప్రతి నిర్ణయానికి దానికి తగ్గ వెల కట్టి తీరాలి" అంటూ ట్రైలర్‌లో వినిపించిన డైలాగ్స్ ఆకర్షణగా నిలిచాయి. యశ్ మాట్లాడుతూ.. "ఇది నా సినిమా కాదు.. ఇది ఇండియన్ సినిమా. ఇండియన్ సినిమాను గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై నిలబెట్టాలనే సంకల్పంతో ఈ సినిమా చేశాం. దీని కోసం గీతూ మోహన్‌దాస్ ఎన్నో త్యాగాలు చేశారు. నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి చేసిన సినిమా ఇది" అన్నారు. ఈ కార్యక్రమంలో నయనతార, వెంకట్ కె.నారాయణ, హ్యూమా ఖురేషీ, రుక్మిణి, తారా సుతారియా, అక్షయ్ ఒబెరాయ్ తదితరులు పాల్గొన్నారు.

# 'వారణాసి' అప్‌డేట్.. రుద్రగా మహేశ్.. ఫస్ట్‌లుక్ రిలీజ్..



మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి' . నేడు మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు. రుద్రని పరిచయం చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'రౌద్రం ఒక్కటే అతడి స్వభావం కాదు' అనే క్యాప్షన్ పెట్టారు .'రుద్ర' అనగానే మనకు తీవ్రమైన కోపం, మాస్ యాక్షన్ లేదా భీకరమైన రూపం గుర్తుకొస్తుంది. కానీ రాజమౌళి ఈ ఫొటోలతో.. ఈ పాత్రలో కేవలం కోపం కాకుండా ప్రశాంతత, లోతైన ఆలోచనలతో మరిన్ని భిన్నమైన షేడ్స్ కూడా ఉంటాయని స్పష్టం చేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా క్లాస్, హ్యాండ్సమ్ లుక్స్‌లో కనిపించే మహేష్ బాబు ఈ ఫొటోల్లో ఒత్తైన జుట్టు, గడ్డం మీసాలతో పూర్తి మాస్, రగ్గడ్ అడ్వెంచరర్ లుక్‌లో కనిపిస్తున్నారు.ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు రుద్ర ప్రపంచం నుంచి మీకోసం చిన్న సర్‌ప్రైజ్ అంటూ మహేశ్ ఈ ఫొటోలు పంచుకున్నారు."మహేష్ బాబుకు హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు. మీరు ఎక్కడికి వెళ్లినా అక్కడ పంచే ప్రేమ, నింపే అపరిమితమైన శక్తి, అభిమానులకు మీరిచ్చే ఉత్సాహం.. అన్ని గొప్ప విషయాలే. వారణాసి అద్భుతాలకు స్వాగతం" అంటూ చిత్రనిర్మాణ సంస్థ దుర్గా ఆర్ట్స్ మహేశ్‌కు విషెస్ తెలిపింది.

# అప్పుడు సూర్యని కలవలేకపోయా.. ఇప్పుడు కలిసి నటించా!



మలయాళ బ్యూటీ మమితా బైజు ప్రస్తుతం 'డ్యూడ్', 'జన నాయగన్' సినిమాల సక్సెస్‌తో ఫుల్ ఫామ్‌లో ఉన్నారు. ప్రస్తుతం సూర్య హీరోగా నటిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్'తో మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌కు రెడీ అవుతున్నారు. ఈ క్రమంలో తాను 2015లో సూర్యను కలవాలని ఎంత ప్రయత్నించానని చెప్తూ.. ఒక సంఘటనను గుర్తుచేసుకున్నారు. కేరళలో జరిగిన మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌లో ఆమె మాట్లాడారు. "2015లో సూర్య సర్ కొచ్చిలోని ఒక మాల్‌లో ఈవెంట్‌కి వచ్చారు. అప్పుడు నేను 8వ తరగతి చదువుతున్నా. అదే స్కూల్‌లో మా అన్నయ్య 11వ తరగతి చదువుతున్నాడు. మా అన్నయ్య.. స్నేహితులతో కలిసి సూర్య సర్‌ని చూసేందుకు కొచ్చికి వెళ్లాడు. నేను కూడా ఆయనను కలవాలని చాలా కోరుకున్నాను. ఎంతో ప్రయత్నించాను. వాళ్లతో పాటు వెళ్తానని అమ్మానాన్నతో చెప్పాను. కానీ, వారు నన్ను వెళ్లనివ్వలేదు.ఆ తర్వాత అన్నయ్య.. సూర్య సర్‌తో దిగిన ఫొటో నాకు చూపించాడు. అది చూసి నిరాశపడ్డాను. కానీ, ఇప్పుడు సర్‌తో కలిసి సినిమాలో నటించాను. ప్రస్తుతం ఆయనతో కలిసి ఇక్కడ నిలబడడం గొప్ప వరం లాంటిది" అని మమితా ఎమోషనల్‌గా పేర్కొన్నారు. ఇక, వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య కథానాయకుడిగా 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెరకెక్కింది. మమితా బైజు కథానాయిక. రవీనా టాండన్, రాధిక శరత్‌కుమార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ తెలుగు, తమిళ భాషల్లో ఆగస్టు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.